
సాక్షి
ఒడిశా
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.3,45,908
బంగారం: 3 గ్రాములు, 90 మిల్లీ గ్రాములు
వెండి: 70 గ్రాములు, 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



50 మంది గిరిజనులకు పట్టాలు అందజేత

జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితిలో శనివారం 50 మంది గిరిజన లబ్ధిదారులకు అటవీ భూముల పట్టాలను అధికారులు అందజేశారు.

-8లో▸



ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

రాయగడ జిల్లాలోని కొలనార సమితి కెలిగుడ పంచాయతీ పాయికొపాడ ప్రాథమిక ఆదివాసీ సేవాశ్రమంలో మూడో తరగతి చదువుతున్న తపస్విని పిడిక అనే విద్యార్థిని మృతి చెందింది.

-8లో▸

న్యూస్‌రీల్

రంగంలోకి దిగిన అధికారులు



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం మహిళ ఆకర్షణీయ పథకం సుభద్ర యోజన మార్గదర్శకాల్ని జారీ చేయడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఈ యోజన వాస్తవ అమలు, కార్యాచరణకు సంబంధించి అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. భారత ప్రధానమంత్రి సెప్టెంబర్ 17న ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సుభద్ర పథకం వివరణాత్మక మార్గదర్శకాలు సకాలంలో జిల్లా మేజిస్ట్రేట్‌లకు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పథకం ఔత్సాహిక లబ్ధిదారులు తమ దరఖాస్తు ఫారమ్ అంగన్‌వాడీ కేంద్రం, మండల కార్యాలయం, జనసేవా కేంద్రం మరియు మో సేవా కేంద్రంలో లభ్యమయ్యేలా ఏర్పాటు చేస్తారు. పూర్తి వివరాలతో భర్తీ చేసిన దరఖాస్తు ఫారమ్‌లు కామన్ సర్వీస్ సెంటర్ లేదా మో సేవా కేంద్రంలో సమర్పించబడతాయి. వివిధ మాధ్యమాల సహాయంతో పథకానికి సంబంధించిన అవసరమైన సమాచారాన్ని వాటాదారులకు పంచేందుకు చర్చలు జరిగాయి.

వీరుల త్యాగాలను జాతి మరువదు



అమరుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కొరాపుట్: స్వాతంత్ర్య పోరాటంలో టురి నది వద్ద ప్రాణాలు కోల్పోయిన 26 మంది వీరుల త్యాగాలను జాతి మరువదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గోండో అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి టురి నది వద్ద శనివారం జరిగిన అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టురి నదిలో అమరులకు పిండ ప్రదానం చేశారు. సర్వ మతాల పెద్దలు అమరుల ఆత్మ శాంతికి సందేశాలు ఇచ్చారు. అమరులు కుటుంబాలను సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ మున్నాఖాన్, లోక్‌సభ ఎంపీ బలభద్ర మజ్జి, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, నర్సింగ బోత్ర, మనోహర్ రందారి, కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ రోహిత్ వర్మ, మాజీ మంత్రి రమేష్ మజ్జి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడి అవతారమెత్తిన కలెక్టర్



పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఆశిష్


మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఆశిష్ పర్యటించారు. దీనిలో భాగంగా జోడాంబో, జాన్‌బాయి, పెప్పరమెట్ల పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఉత్తమంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం తాగునీటి సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆయనతో పాటు ఐపీసీ ముకుందో మేల్కా తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఖెపురియ



అవార్డు అందుకుంటున్న రొయిమతి

జయపురం: వ్యవసాయ రంగానికి రొయిమతి ఖెపురియ చేసిన సేవలకు గాను న్యూఢిల్లీ టైమ్స్ నెట్‌వర్క్ ఆమెకు అమేజింగ్ ఇండియన్స్ అవార్డు–2024 ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా న్యూఢిల్లీలో కేంద్రమంత్రి కిరణ్ రిజు ఆమెకు అవార్డును శనివారం అందజేశారు. దీంతో ఆమెను ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ జయపురం సెంటర్ డైరెక్టర్ డా.ప్రశాంత కుమార్ పొరిడ అభినందించారు. ఆమెకు అవార్డు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు.



- పర్యాటకులను ఆకర్షిస్తున్న ప్రకృతి అందాలు
- మౌలిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం

ఉరుకుల, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ రీచార్జి వంటివి విహార యాత్రలు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తే మనస్సుకి కలిగే స్వాంతన మాటల్లో వర్ణించలేనిది. చల్లని గాలులు మనల్ని తాకుతుండగా, సముద్రపు ఒడ్డున కుటుంబంతో కాలక్షేపం చేస్తే వచ్చే ఆనందం అంతులేనిది. సహజ సిద్ధంగా ఏర్పడి పైనుంచి జాలువారే జలపాతంలో స్నానం చేస్తే ఎంతో ప్రశాంతత లభిస్తుందంటే అతిశయోక్తి కాదు. సూర్యోదయం, సూర్యాస్తమయాలు చూసి, వెన్నెల్లో కబుర్లు చెప్పుకుంటే ఎంతో హాయ్.. హాయ్. అలాంటి ప్రకృతి అందాలు ఉత్కళ తీరంలో రా.. రమ్మని ఆహ్వానిస్తున్నాయి. వాటిని ఒక్కసారి పరిచయం చేయడమే ఈ సండే స్పెషల్...

– సాక్షి నెట్‌వర్క్

అందాలలో మహోదయం

ఉత్కళ ప్రకృతి అందాల సొగసు చూడతరమా..!

SUNDAY SPECIAL





సాగర సోయగం

ఒకవైపు విశాలమైన సాగర తీరం.. మరోవైపు ఏపుగా పెరిగి ఆకాశాన్ని తాకే సరుగుడు చెట్లు, సముద్ర అందాలను తిలకించేందుకు వరిగడ్డితో ఏర్పాటు చేసిన విశ్రాంతి పాకలు, రోజంతా గడిపేందుకు కుటీరాలు ఒక్కముక్కలో చెప్పాలంటే అచ్చం విశాఖపట్నం బీచ్‌ను తలదన్నేలా మౌలిక సదుపాయాలతో అలరించే బీచ్ 'సూన్‌పూర్ ఇకో రిట్రీట్'. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ బీచ్ గత రెండేళ్ల నుంచి విశేష ప్రాచుర్యం పొంది పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఇక్కడికి బ్రహ్మపుర పట్టణం వరకు రైలు, బస్సు సౌకర్యాలు ఉన్నాయి. అక్కడి నుంచి 28 కి.మీ దూరంలో ఈ బీచ్ ఉంది. పగటి పూట మాత్రమే బీచ్ సందర్శించడానికి అనుమతి ఇస్తారు.

బ్రహ్మపుర నుంచి సుమారు 28 కి.మీ దూరంలో







పర్లాకిమిడి నుంచి సుమారు 85 కి.మీ దూరంలో


మినీ టిబెట్ చంద్రగిరి

గజపతి జిల్లాలో మినీ టిబెట్‌గా పిలువబడే అందమైన గ్రామం చంద్రగిరి. పర్లాకిమిడి నుంచి 85 కిలోమీటర్ల దూరంలో చంద్రగిరి టిబెటియన్ శరణార్థుల శిబిరం ఉంది. 1963 మే1న చైనా టిబెట్ నుంచి టిబెటియన్లను తరిమేసిన అనంతరం వారి నాయకుడు దలైలామా అప్పటి భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఆశ్రయించారు. దీంతో ఒడిశాలోని చంద్రగిరిలో టిబెట్ శరణార్థులకు ఆశ్రయం కల్పించారు. అప్పటి నుంచి వారు ఇక్కడ స్థిరపడ్డారు. ఇక్కడికి వెళ్తే బౌద్ధ రామాలు, బౌద్ధ మోనాస్ట్రీ, పద్మనాభ సంభవ, సెంట్రల్ పాఠశాలలు మనం చూసినపుడు టిబెటిన్‌లో ఉన్నట్లే అనిపిస్తుంది. చంద్రగిరిలో పర్యాటకుల కోసం ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్) గెస్ట్‌హౌస్ నిర్మించింది. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకుల కోసం బోటింగ్ కూడా ఏర్పాటు చేసింది.

అందాలకు నెలవు మల్కన్‌గిరి



తారాబ్ జలపాతం



సలీమ్ జలపాతం

మల్కన్‌గిరి జిల్లాలో ఉన్న ప్రకృతి అందాలు రారమ్మని ప్రకృతి ప్రేమికులను పిలుస్తున్నాయి. మల్కన్‌గిరి జిల్లా మూడు రాష్ట్రాలు ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీష్‌గఢ్, సరిహద్దుల్లో ఉంది. మల్కన్‌గిరి అంటే ఒకప్పుడు మావోల అలజడితో, దండకారణ్యంలో తపాకీ చప్పుళ్లలో నిత్యం వార్తల్లో నిలిచేది. కానీ ఇప్పుడు మావోయిస్టుల అలజడి తగ్గడంతో ప్రకృతిని ఆస్వాదించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. మల్కన్‌గిరికి సుమారు 60 కి.మీ దూరంలో సలీమ్ వాటర్ ఫాల్స్ ఉంది. అలాగే మల్కన్‌గిరి నుంచి చిత్రకొండ సమితి మీదుగా సుమారు 90 కి.మీ దూరంలో తారాబ్ వాటర్ పాల్స్ ఉన్నాయి. మల్కన్‌గిరి బోండా గిరిజనులు ఉండే ఘాటీ, ఓలిసి పూలు , చిత్రకొండ జలాశయం, బలిమెల ఘాట్ రోడ్, సీతారాముల వనవాసం ప్రాంతం, పాండవుల అరణ్యవాసం ప్రాంతం కూడా ఇక్కడే ఉన్నాయి. ఇవన్నీ కలగలిసి మల్కన్‌గిరి పర్యాటక శోభతో విరజిల్లుతోంది.

మల్కన్‌గిరికి సుమారు 60 కి.మీ దూరంలో

చాటికొన జలపాతం

రాయగడ నుంచి సుమారు 47 కి.మీ దూరంలో

రాయగడ జిల్లా కేంద్రానికి సుమారు 47 కిలోమీటర్ల దూరంలో చాటికొన జలపాతం ఉంది. బిసంకటక్ సమితి పరిధిలోని ఈ పర్యాటక ప్రాంతానికి వెళ్లేందుకు రాయగడ నుంచి బస్సులు, ఆటోలు, టెంపోలు అందుబాటులో ఉన్నాయి. ప్రకృతికి నిలయంగా ఉన్న ఈ జలపాతాన్ని ఇక్కడి సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు పరిసర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు విచ్చేస్తుంటారు. ఇక్కడి ప్రాముఖ్యంలో భాగంగా పాతాలేశ్వర శైవక్షేత్రం ఉంది. శ్రావణ మాసంలో బోల్‌భం భక్తులు, కార్తీకమాసంలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం చాటికొనను పర్యాటక స్థలంగా గుర్తించి దీని అభివృద్ధి కోసం సమారు రూ.25 లక్షలను గతేడాది కేటాయించింది.



చాటికొన జలపాతం



చాటికొనలో పాతాలేశ్వర ఆలయం

రోప్ వే బ్రిడ్జి

రాయగడ పట్టణంలోని చెక్కాగుడలో రోప్ వే బ్రిడ్జి ఉంది. నాగావళి నదిపై దీనిని నిర్మించారు. సమారు రూ.15 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అందంగా తీర్చిదిద్దింది. దీంతో ఆదివాసీ గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగు పరచడంతో పాటు పర్యాటకులను కనువిందు చేస్తోంది. అయితే ఇక్కడ తరుచూ ఎంతోమంది నీటిలో మునిగి మృతి చెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటుండడంతో జిల్లా యంత్రాంగం దీనిని డెత్ జోన్‌గా ప్రకటించి పర్యాటకులు, సందర్శకులు లోపలకు వెళ్లకుండా ప్రధాన గేట్లను మూసివేసింది. అయితే కొంతమంది ఔత్సాహికులు ప్రధాన గేట్ల లోపలకు చొరబడి ఫొటోలు తీసుకుంటుండడం పరిపాటిగా మారింది.



రోప్ వే బ్రిడ్జి



మాలిగుడ రైల్వే టన్నల్

జయపురం సమితిలోని మాలిగుడలో ఈ రైల్వే టన్నల్ ఉంటుంది. ఇది దేశంలోనే నాల్గో పెద్ద రైల్వే బ్రాడ్‌గేజ్ వంతెన కావడం విశేషం. ఇక్కడికి కొరాపుట్ మీదుగా గానీ, జయపురం నుంచి గానీ ట్రైన్‌పై వెళ్లవచ్చు. జయపురం రైల్వేస్టేషన్ నుంచి 13 కిలోమీటర్లు, కొరాపుట్ రైల్వేస్టేషన్ నుంచి 25 కిలోమీటర్లు దూరం ఉంటుంది. అలాగే రోడ్డుమార్గంలో సైతం జయపురం నుంచి వెళ్లవచ్చు. దీని ఎత్తు 3,147 మీటర్లు, పొడవు 4.4 కి.మీ ఉంటుంది.

దుడుమా

జయపురం సమితి మాచ్‌ఖండ్‌లో దుడుమా జలపాతం ఉంటుంది. జయపురం నుంచి లమతాపుట్ మీదుగా వాహనాలపై రోడ్డు మార్గంలో వెళ్లవచ్చు. జయపురం నుంచి సుమారు 60 కిలోమీటర్లు ఉంటుంది. ఇది ఒడిశాలో ప్రథమ జల విద్యుత్ ప్రాజెక్టు కావడం విశేషం. ఈ వాటర్ ఫాల్స్ 540.19 అడుగుల ఎత్తు పర్వతం నుంచి పారుతుంది. ఈ జలపాతం ఎత్తును ఆంగ్లేయ అధికారి డి.డబ్ల్యు.గొలాన్ 1929 మే 4వ తేదీన రికార్డు చేశారు. ఈ జలపాతం నుంచి ఒక సెకండ్‌కు 104 క్యూసెక్కు అడుగుల నీరు జారుతుంది.





గండాహతి

పర్లాకిమిడి పట్టణానికి సమీపంలోని రాయఘడ బ్లాక్‌లో గండాహతి జలపాతం పర్యాటకులను మైమరిపింపజేస్తోంది. అక్కడి జలపాతాల హోయలు చూడటానికి, పక్షుల కిలకిల రావాలు వినడానికి పర్యాటకులు అధికంగా విచ్చేస్తున్నారు. గండాహతి జలపాతం ఎగువన కూడా చుట్టూ పచ్చని చెట్లతో అహ్లాదకరమైన వాతావరణాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. ఇక్కడకు వచ్చిన పర్యాటకులుకు ఫాస్ట్‌ఫుడ్, కార్ పార్కింగ్, మ్యారేజ్ ఈవెంట్స్ జరుపుకోవడానికి కాటేజీలు ఉండడంతో ఇటీవల పర్యాటకుల సందడి పెరిగింది. అయితే మద్యపానం చేయడాన్ని గండాహతి వద్ద నిషేధించారు.



పాత్రోపుట్ వంతెన

జయపురం సమితిలోని కొంజయిలో పాత్రోపుట్ ఉంటుంది. జయపురం నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరం. జయపురం నుంచి బొయిపరిగుడ, లమతాపుట్‌కు వెళ్లే మార్గంలో ఈ ప్రాంతాన్ని సందర్శించవచ్చు. ఆంగ్లేయులు నిర్మించిన ఈ వంతెన పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

దేవమాలి పర్వతం

కొరాపుట్ నుంచి సుమారు 61 కి.మీ దూరంలో

కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొలియా గ్రామ పంచాయతీ బరబంధ గ్రామ సమీపంలోని చంద్రగిరి అటవీ ప్రాంతంలో దేవమాలి పర్వతం ఉంటుంది.భూతల స్వర్గంగా దేవమాలి పర్వతాన్ని పరిగణిస్తారు. ఈ పర్వతం పైకి వెళ్లి సూర్యోదయం, సూర్యస్తమయం చూడడానికి రెండు కళ్లు చాలవు. ఇక్కడికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. కొరాపుట్ నుంచి 61కి.మీ., సాలురు నుంచి 75 కి.మీ దూరంలో ఉంటుంది. పర్వతం మీదకు కార్లు, వ్యాన్లు వెళ్తాయి. అక్కడ ఉండడానికి ఒడిశా ప్రభుత్వం ఎకో రిట్రీట్ సెంటర్లు ఏర్పాటు చేసింది.



దేవమాలి పర్వతంపై సూర్యోదయం



దేవమాలిపై పగటి పూట దృశ్యం



ఖసడా

ఖసడా జలపాతాలు పర్లాకిమిడి నుంచి 95 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ జలపాతాలు భువనేశ్వర్, బరంపురం, ఉత్తరాంధ్రలోని పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. చంద్రగిరికి పదకొండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖసడా జలపాతాలు ఒక పిక్నిక్ స్పాట్‌గా పేరొందాయి. ఖసడా జలపాతాలు చుట్టూ దట్టమైన అడవులు, క్రిస్టల్ వాటర్ సందర్శకులను అమితంగా ఆకర్షిస్తోంది. జిరంగో నుంచి ఖసడకు అనేక ఆటోలు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. జిరంగో గ్రామం తిరిగి వస్తే అక్కడ ఫాస్ట్‌ఫుడ్, టిబెటియన్ రిస్టారెంట్లు పర్యాటకులకు కావాల్సిన ఆహారం లభ్యమవుతాయి.

పక్షుల ప్రపంచం చిలికా

ఈ సరస్సు ఒడిశాలోని పూరీ, ఖుర్దా, గంజాం జిల్లాల్లో 1,100 చ.కి.మీ విస్తరించి ఉంది. యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఇక్కడికి రష్యా, కజకిస్తాన్, కిర్గిజ్, మధ్య–ఆగ్నేయాసియా దేశాలతో పాటు హిమాలయాల నుంచి 160 రకాలకు పైగా జాతుల పక్షులు వలస వస్తాయి. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు భువనేశ్వర్ దగ్గర ఎయిర్‌పోర్టు, రైలు ద్వారా వెళ్తే బల్లుగాం, చిలికా స్టేషన్లు ఉన్నాయి. బస్సు ద్వారా వెళ్లే వారు బల్లుగాం వరకు వెళ్తే అక్కడ నుంచి ఆటోలు దొరుకుతాయి. బ్రహ్మపుర పట్టణానికి సుమారు 75 కి.మీ దూరంలో ఉంటుంది.



క్లుప్తంగా

రూ.55 కోట్లతో బ్యాడ్మింటన్ 'హెచ్‌పీసీ'



తుదిమెరుగులు దిద్దుకుంటున్న భవనం

భువనేశ్వర్: నగరంలో బ్యాడ్మింటన్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్ (హెచ్‌పీసీ) ప్రారంభానికి సిద్ధమైంది. డాల్మియా సిమెంట్ భాగస్వామ్యంతో 3.04 ఎకరాల విస్తీర్ణంలో రూ.55 కోట్లు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాన్ని నిర్మించింది. క్రీడాకారులు, ప్రేక్షకుల కోసం అధునాతన హంగులతో భవనం రూపుదిద్దుకుంది. ఇందులో 8 కోర్టులు, 500 మంది కూర్చునే సామర్థ్యం, ఇతర ఆధునిక సౌకర్యాలు ఉంటాయి.

టికిరిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రాయగడ: జిల్లాలోని టికిరి గ్రామంలో ఉత్కళ అల్యూమిన కంపెనీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా శిబిరాన్ని ప్రారంభించారు. కర్మాగారంలోని ఉద్యోగులు, సిబ్బంది రక్తాన్ని దానం చేశారు. 158 యూనిట్ల రక్తం సేకరించినట్లు కంపెనీ యాజమాన్యం పేర్కొంది. రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని కంపెనీ అదనపు కలెక్టర్ భాస్కర రైతా అన్నారు. కంపెనీ యూనిట్ మెడ్ రవి మిశ్రా, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఫిరోజ్ కుజూర్ తదితరులు పాల్గొన్నారు.

బొయిపరిగుడను భయపెడుతున్న అతిసార



అతిసార వ్యాధితో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగులు

జయపురం: బొయిపరిగుడ సమితి బాగ్‌దేరి పంచాయతీ ముండపుట్ గ్రామంలో అతిసార బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా.. పలువురు చికిత్స పొందుతున్నారు. ఇదే సమితి బిజాపూర్ గ్రామ పంచాయతీ పొడెయిఖదర్‌లోనూ అతిసార విజృంభిస్తోంది. వారం రోజుల వ్యవధిలో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మరికొందరు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. ఇప్పటికే పొడెయిఖదర్ గ్రామానికి వైద్యుల బృందాన్ని పంపించినట్లు హాస్పిటల్ అధికారి డాక్టర్ విశ్వజిత్ భుయ తెలిపారు.

80 లీటర్ల నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా, ఊటలతో ఉన్న డ్రమ్ముల వద్ద ఎక్సైజ్ సిబ్బంది

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోగల జంగడపాదొరొ గ్రామంలో అబ్కారీశాఖ సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఆకస్మిక దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో 80 లీటర్ల నాటు సారాతో పాటు సారా తయారీకి వినియోగించే విప్పపువ్వు ఊటను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సారా, ఊటను ధ్వంసం చేశారు. పోలీసుల రాకను గమనించి సారా తయారీదారులు పరారైనట్టు అబ్కారీ అధికారి సంజయ్ కుమార్ ప్రధాన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

120 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో పోలీసులు

పర్లాకిమిడి: బరంపురం దక్షిణ మండలం అబ్కారీ సిబ్బంది శనివారం ఉదయం గజపతి – గంజాం సరిహద్దు నాకాగేటు వద్ద మాటువేసి కారును అడ్డుకున్నారు. అందులో మూడు బస్తాల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన వారిలో గజపతి జిల్లా మోహనా బ్లాక్‌కు చెందిన కోరాడ చిరంజీవి, కోరాడ బిక్కి, అడవ గ్రామానికి చెందిన అయబ్ నాయక్ ఉన్నారు. కారును సీజ్ చేసి రూ.5.50 లక్షల విలువైన బైక్‌ను కూడా స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు.

ఘనంగా జాతీయ మహా ఆకాశ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రధాన ఉపాధ్యాయుడు ప్రకాశ పట్నాయక్

జయపురం: జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం జాతీయ మహా ఆకాశ (నేషనల్ స్పేస్ డే) దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టు 23వ తేదీన మన దేశం చంద్రయాన్–3 ని విజయవంతంగా ప్రయోగించిందని అన్నారు. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకొని జాతీయ మహా ఆకాశ దినంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆ సంఘటన విజ్ఞాన రంగంలో మన దేశం ప్రగతి పథంలో పయనిస్తోందని ప్రపంచానికి తెలియజేసిందన్నారు. మన పాఠశాల విద్యార్థి కూడా ఇస్రో వెళ్లే అవకాశం లభించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పేస్‌పై వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొనిత శతపతి, సుసరిత పట్నాయక్, దుర్గా ప్రసాద్ పాత్రో, అరుంధతీ త్రిపాఠి, శుభశ్మిత సాహు, కె.ప్రమీళ, సస్మిత జెన, సోమనాథ్ సాకియ, దేవేంద్రపాఢీ, సంతోషిణీ పండ పాల్గొన్నారు.



చిత్ర కళా పోటీలో బహుమతి అందుకుంటున్న విద్యార్థిని



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

50 మంది గిరిజనులకు పట్టాలు అందజేత



పట్టాలు పొందిన లబ్ధిదారులతో అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితిలో శనివారం 50 మంది గిరిజన లబ్ధిదారులకు అటవీ భూముల పట్టాలను అధికారులు అందజేశారు. కుంద్ర తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ బినోద కుమార్ నాయిక్ చేతుల మీదుగా లబ్ధిదారులు పట్టాలను అందుకున్నారు. 'మా జంగిల్ జొమి'పథకంలో భాగంగా అటవీ భూముల పట్టాలు అందజేసినట్లు తహసీల్దార్ వెల్లడించారు. అటవీ భూముల పట్టాల కోసం 710 మంది దరఖాస్తులు పెట్టుకున్నారన్నారు. వీరిలో 479 మంది దరఖాస్తులను ఆమోదించామని.. వారందరికీ రెండు నెలల్లో పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. కొరాపుట్ స్ట్రైడ్ స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్ట్రైడ్ రాష్ట్ర కార్యదర్శి బిద్యుత్ మహంతి అధ్యక్షత వహించారు. గౌరవ అతిథిగా సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ, అటవీ విభాగ అధికారి ఛొబీంద్ర రొందారి, సమితి సంక్షేమ అధికారి సుజన రంజన్ జాలి, సర్పంచ్ లొబొ పొరజ, సమితి సభ్యులు దామోదర గోండ్, అటవీ అధికార కమిటీ బ్లాక్ అధ్యక్షులు చంద్ర సాగరియ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

రాయగడ: దుర్గాపాడు ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.అనిల్‌కుమార్, అసిస్టెంట్ టీచర్ ఘన సబర్‌లను జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి సస్పెండ్ చేశారు. విద్యార్థిని మృతికి సంబంధించి దర్యాప్తు చేపట్టిన అధికారుల నివేదికను పరిశీలించిన కలెక్టర్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 7న 6వ తరగతి విద్యార్థిని మనీషా మండంగి మలేరియా వ్యాధితో మృతి చెందిన విషయం తెలిసిందే. సకాలంలో చికిత్స అందకపోవడం, ఆశ్రమ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన కుమార్తె మృతి చెందిందని తండ్రి మహేంద్ర మండంగి ఆందోళనకు దిగడంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భరత్ భూషణ్ బిశ్వల్ సమగ్ర దర్యాప్తునకు సమితి సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్‌కుమార్ నాయక్‌ను ఆదేశించారు. ఈ మేరకు సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

పర్లాకిమిడి: పర్లాకిమిడికి 7 కి.మీ దూరంలో ఉన్న సెంచూరియన్ వర్సిటీకి అవతల పాటికోట గ్రామం కొండ వద్ద ఒక గుర్తు తెలియని యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. ఈ విషయం గురండీ పోలీసు ఐఐసీ రబీంద్ర పాత్రోకి తెలియజేయగా వెంటనే ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసును విచారిస్తున్నారు. అయితే ఆ యువకుడిని ఎవరైనా హత్య చేశారా..? ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

డబ్బుల కోసం రోగులను వేధిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద వైద్యం తీసుకొనే రోగులను డబ్బుల కోసం వేధిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్ల నుంచి ఏ విధమైన నగదు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెరుగైన వైద్యం అందించే బాధ్యత ఆరోగ్య మిత్రలదేనన్నారు. వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశరావు మాట్లాడుతూ వైద్య పరీక్షల చార్జీలు డిస్‌ప్లే చేయాలన్నారు. సెకండరీ పరీక్షలకు కూడా నగదు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వచ్చే బాధితులకు అక్కడ వైద్యం లేకపోతే ఎక్కడైతే ట్రీట్ మెంట్ ఇస్తారో ఆ ఆసుపత్రుల పేర్లు కచ్చితంగా తెలపాలన్నారు. భోజనం మెనూలో పాలు, పండ్లు ఉంచాలన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలని నర్సుల ఆందోళన



ఆస్పత్రి ఆవరణలో బైఠాయించిన నర్సింగ్ ఉద్యోగులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సులకు ఉద్యోగోన్నతి కల్పించాలని ఒడిశా నర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి డీహెచ్‌హెచ్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఉద్యోగం పొందిన ఆరేళ్ల తరువాత నర్సులను సీనియర్లుగా గుర్తించి వారికి ఉద్యోగోన్నతి కల్పించి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించాలని, మరో పది డిమాండ్లు పరిష్కారం చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. ఈనెల 27వ తేదీలోగా డిమాండ్లు పరిష్కరించలేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో సంఘం కార్యదర్శి అనితా పాత్రో, సంధ్యారాణి దేయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల దోపిడీకే చట్ట సవరణలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

- అఖిల పక్ష చర్చావేదికలో పలువురు వక్తలు

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లిం మైనార్టీలను బోర్డు నుంచి తొలగించేలా ఉందని, ఆస్తుల దోపిడీకే సవరణలు చేసినట్లు ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదులో శనివారం వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అఖిల పక్ష చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీలలో పెట్టాలని, వారికి కూడా హక్కులు కల్పించాలనటంలో కేంద్ర ప్రభుత్వ కపటత్వం బయట పడిందన్నారు. ముస్లింలపై చిత్తశుద్ధి ఉంటే సచార్ కమిటీ నివేదిక, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసులపై పార్లమెంట్‌లో చర్చించి అమలు చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ముస్లిమ్‌లనే లక్ష్యంగా చేసుకొని వారి ఆర్థిక, సాంఘిక, వాణిజ్య, విద్య, భాష, సంస్కృతిపై భౌతిక దాడులకు దిగుతోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులను, హస్తగతం చేసుకోవడానికి అనేక కుట్రపూరిత చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇప్పటికే వక్ఫ్ ఆస్తులు, భూములను అధికార పార్టీల నాయకులు కబ్జాలకు పాల్పడలేదా..? అని ప్రశ్నించారు.

విభజించు, పాలించు అనే సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం విడనాడాలని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వక్ఫ్ అనేది ముస్లిం మైనారిటీల దేవదాయ భూమి అని, ముస్లింలు దైవ సంబంధమైన, సేవాపరమైన పవిత్ర కార్యక్రమాలకి తమ సొంత భూముల్ని ఆస్తులను దానం చేస్తారని తెలిపారు. దేశంలో 9 లక్షల 20వేల ఎకరాలు భూమి వక్ఫ్ కింద ఉందని, దీని విలువ సుమారు లక్ష 20 వేల కోట్ల రూపాయలు ఉంటుందని వివరించారు. ఈ భూములను కాజేసేందుకు కార్పొరేట్లు చట్ట సవరణను వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలోజామియా మసీదు అధ్యక్షుడు మహిబుల్లాఖాన్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి, బాడాన దేవభూషణరావు, సురంగి మోహనరావు, శ్రీనివాసరావు, గంజి ఆర్.ఎజ్రా, కంఠ వేణు, గణేష్, పిసిని చంద్రమోహన్, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



మంత్రికి కొత్తమ్మతల్లి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకూ జరగనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో కొత్తమ్మతల్లి ఆలయ ఈఓ విజరాఘాకృష్ణ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో టెక్కలి సబ్ కలెక్టర్ నేతృత్వంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఈఓను ఆదేశించారు.

రహదారులు బాగుచేయండి



కూనేరు రహదారి వద్ద ఆందోళన చేస్తున్న ట్రక్ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండబాబు, సభ్యులు

- ఏపీ ప్రభుత్వానికి ట్రక్ యజమానులు వినతి

రాయగడ: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు పరిధిలో ఉన్న రోడ్లను బాగు చేయాలని రాయగడ ట్రక్ యజమానుల సంఘ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా కూనేరు నుంచి పార్వతీపురం వరకు గల రహదారులను ఏపీ ప్రభుత్వ బాగు చేయాలని కోరుతూ ట్రక్ యజమానుల సంఘం అధ్యక్షులు ఎల్ల కొండబాబు, సంఘం సభ్యులు శనివారం ఆందోళన చేపట్టారు. రోడ్లు బాగు చేయాలని కోరుతూ కూనేరు, గుమడ ప్రాంతాల్లో నినాదాలు చేశారు. కూనేరు నుంచి పార్వతీపురం వరకు రహదారులు అత్యంత దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. విశాఖపట్నం నుంచి రాయగడ మీదుగా రాంచీ, రాయిపూర్ వంటి ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయని చెప్పారు. అటువంటి ప్రాధాన్యత గల ఈ మార్గంలోని రహదారులు చెరువులను తలపించే విధంగా ఉన్నాయని అన్నారు. పొరుగు రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి రోడ్లను మెరుగు పరచాలని కోరారు. ఇదిలాఉండగా రాయగడ నుంచి అత్యవసర పరిస్థితిలో చికిత్స కోసం విశాఖ వెళ్లే రోగులను అంబులెన్స్‌లో తరలించే సమయంలో గుంతలమయమైన రోడ్ల కారణంగా నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కూనేరు నుంచి పార్వతీపురం వరకు గల రహదారిలో వాహనాలు ఒరిగిపోవడం, బోల్తాపడిన సంఘటనల కారణంగా ఒక్కో సమయంలో ట్రాఫిక్ నిలిచిపోయి మార్గమధ్యలోనే అంబులెన్స్‌లోని రోగులు మృతి చెందుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై దృష్టిసారించాలని రాయగడ ప్రజలు కోరుతున్నారు. ఆందోళనలో పార్వతీపురం ప్రాంతానికి చెందిన సీపీఐ(ఎంఎల్) నాయకుడు శాంబయ్య ఉన్నారు.

విద్యార్థినుల నిరసన ర్యాలీ



ర్యాలీలో పర్లాకిమిడి మహిళా స్వాతకోత్సవ కళాశాల విద్యార్థినులు



పట్టణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు



జయపురం: కొవ్వొత్తుల ర్యాలీలో విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు



జయపురం: పట్టణంలో సాగుతున్న ర్యాలీ

పర్లాకిమిడి: కోల్‌కోతాలో వైద్య విద్యార్థినిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు నినదించారు. విద్యార్థిని హత్యకు నిరసనగా స్థానిక మహిళా స్నాతకోత్సవ కళాశాల ప్లస్‌టూ విద్యార్థినులు పర్లాకిమిడి పట్టణంలో శనివారం భారీ ర్యాలీ చేపట్టారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా దేశవ్యాప్తంగా జూడాలకు రక్షణ కల్పించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ర్యాలీలో ఏబీవీపీ అధ్యక్షులు బాలక్రిష్ణజెన్నా, విద్యార్థి సంఘం అధ్యక్షురాలు శుభప్రదా శర్మ, తపస్వినీ గోమాంగోలు పాల్గొన్నారు.

జయపురంలో..

జయపురం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం జయపురంలో వందలాది మంది కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. జయపురం ఏఐడీఎస్‌వో, ఏఐఎంఎస్‌ఎస్, ఏఐడీవైవో సంస్థల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సంఘటనపై ఉన్నత స్థాయిలో దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా దండించాలని నినదించారు. ఏఐడీఎస్‌వో జిల్లా అధ్యక్షురాలు ఇందుమతి దాస్, కార్యదర్శిణి లక్ష్మీబారిక్, జిల్లా ఏఐడీవైఈవో అధ్యక్షులు రవీంద్రపండ, ఏఐఎంఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్జిత్ సై్వె, కార్యదర్శి జగన్నాథ్ హరిజన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రథొపాడియ కూడలి నుంచి జయపురం బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ సాగింది.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి



పాయికొపాడ ఆశ్రమ పాఠశాల

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి కెలిగుడ పంచాయతీ పాయికొపాడ ప్రాథమిక ఆదివాసీ సేవాశ్రమంలో మూడో తరగతి చదువుతున్న తపస్విని పిడిక అనే విద్యార్థిని మృతి చెందింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొలనార సమితి సూరి పంచాయతీ బహుడి గ్రామానికి చెందిన దీన్‌ధర్ పిడికకు చెందిన తపస్విని ఈ నెల 15న ఆశ్రమంలో ఉండగా అస్వస్థతకు గురయ్యింది. వెంటనే నిర్వాహకులు కొలనార పీహెచ్‌కీ తరలించారు. జ్వరం తగ్గక పోవడంతో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతికి స్పష్టమైన కారణం తెలియకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా కొద్దికాలంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు మృత్యువాత పడుతుండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. అయినా దీనిపై జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం గమనార్హం.

పనుల్లేక పస్తులు

- భవన నిర్మాణ కార్మికుల ఆవేదన
- ఇసుక కొరతే కారణమని మండిపాటు
- ఆర్థిక సాయం అందించాలని సంఘ ప్రతినిధుల డిమాండ్



నరసన్నపేట టౌన్‌లో ఆదివరపుపేట కూడలిలో పనుల్లేక ఉన్న భవన నిర్మాణ కార్మికులు

నరసన్నపేట: ఉచిత ఇసుక పేరిట రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరి కారణంగా జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరత వల్ల పనులు లేక పస్తులు ఉంటున్నారు. రోజూ గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రావడం, పనులు లేక ఉసూరుమంటూ తిరిగి గ్రామాలకు వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగడంతో తాపీమేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో ఉన్నారు. అందులో ఒక్క నరసన్నపేట నియోజకవర్గంలోనే 15 వేల కుటుంబాలు భవన నిర్మాణ పనులు ఆధారంగా జీవిస్తున్నాయి. వీరందరికీ ఇసుక కొరత ఇబ్బందులు తీసుకొచ్చింది. ఉచిత ఇసుక విధానం పేరుతో ఇసుక లభ్యతను దూరం చేయడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ రంగం పూర్తిగా స్తంభించిందని కార్మికులు వాపోతున్నారు. వీటి అనుబంధ రంగాలు కూడా వ్యాపారాలు లేక కుదేలవుతున్నాయి.

ఇతర రంగాలే దిక్కు..

ఇసుక అందించలేకపోతున్న ప్రభుత్వం.. భవన నిర్మాణ పనులు ఊపందుకున్న వరకూ కార్మికులకు నెలవారీ ఆర్థిక సహాయం అందించాలని నరసన్నపేట సంతోషిమాత భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు తర్ర లక్ష్మణరావు, ప్రతినిధులు బోర సూర్యనారాయణ, తర్లా వెంకటి, జనా నర్సింహులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరికొన్నాళ్లు ఇదే పరిస్థితి కొనసాగితే కార్మికులు ఇతర రంగాల వైపు మళ్లడం ఖాయమని చెబుతున్నారు. ఇసుక కొరత కారణంగా వందలాది భవనాల నిర్మాణం నిలిచిపోయిందని, కొత్త నిర్మాణాలు మొదలు కాలేదని అంటున్నారు. గతంలో శ్రావణమాసంలో అధిక సంఖ్యలో కొత్త పనులు మొదలయ్యేవని, ప్రతి మేస్త్రీకి చేతినిండా పనులు ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఒక్క పనీ మొదలు కాలేదని చెబుతున్నారు.

కష్టంగా ఉంది..



పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. రోజూ ఆదివారపుపేట సెంటర్‌కు రూ.50 చార్జీలు పెట్టుకొని వస్తున్నాం. పనుల్లేక తిరిగి వెళ్లిపోతున్నాం. చాలా కష్టంగా ఉంది. పనిదొరికి నెల రోజులవుతోంది. కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉంది. దీనంతటికీ ప్రభుత్వ ఇసుక విధానమే కారణం.

– అర్జునరావు, భవన నిర్మాణ కార్మికుడు, నడగాం

క్లుప్తంగా

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు..



డోలీలో ఆశయ్యను తీసుకువస్తున్న గ్రామస్తులు

పాచిపెంట: మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఏ చిన్న కష్టం వచ్చినా డోలీలే శరణ్యమవుతున్నాయి. అందులోనూ వర్షాకాలంలో అయితే వారి కష్టాలు వర్ణణాతీతం. ఇలాంటి సంఘటన మండలంలోని గొట్టూరు పంచాయతీ రిట్లపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రిట్లపాడు గ్రామానికి చెందిన సేబి ఆశయ్య(59) కొన్ని రోజులుగా టీబీ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. అయితే ఆశయ్య ఆరోగ్యం శనివారం ఉదయానికి బాగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు సుమారు 15 కిలోమీటర్లు డోలీ ద్వారా మైదాన ప్రాంతానికి తీసుకువచ్చి, అక్కడ నుంచి ఆటోలో గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తరలించారు. వెంటనే సిబ్బంది స్పందించి వైద్యసేవలు అందించడంతో ఆశయ్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది.

జాతీయ తైక్వాండో పోటీల్లో హిమశ్రీ ప్రతిభ



హిమశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి, తదితరులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో విజయనగరానికి చెందిన క్రీడాకారిణి వారణాసి హిమశ్రీ ప్రతిభ చాటింది. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన 41వ జాతీయ జూనియర్స్ బాల, బాలికల తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన హిమశ్రీ 52 కిలోల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకుని విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పింది. ఈమేరకు హిమశ్రీని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారిప్రసాద్, కోచ్ రవి, కస్పా ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు సౌధామణి పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని పూల్‌బాగ్ కాలనీ బిట్ -4లో కొందరు న్యూసెన్స్ చేస్తున్నారని డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా అక్కడకు వెళ్లిన టూటౌన్ కానిస్టేబుల్ కృష్ణపై రాళ్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో శనివారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించగా.. మరొకరిని జువైనల్ హోమ్‌కు తరలించామని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.


ఆదిభట్ల ముని మనవరాలు కామేశ్వరమ్మ మృతి



కామేశ్వరమ్మ (ఫైల్)

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు ముని మనవరాలు కామేశ్వరమ్మ (88) శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపై పలువురు తమ సంతాపాన్ని తెలియజేశారు.

ప్రభుత్వ భూముల పరిశీలన



ఎయిర్‌పోర్టు ప్రభుత్వ రిటైనింగ్ భూములను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

భోగాపురం: మండలంలోని కంచేరుపాలెం, రెడ్డికంచేరు రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు 539 ఎకరాల ఎయిర్‌పోర్టు ప్రభుత్వ రిటైనింగ్ భూములను విశాఖపట్నం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ శనివారం పరిశీలించారు. భూములకు సంబంధించిన మ్యాప్‌లతో పాటు కొంగవానిపాలెం నుంచి ముక్కాం వెళ్లే రహదారిలో వీఎంఆర్‌డీఏ ప్లానింగ్‌లో ఉన్న భూములను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట తహసీల్దార్ ఎం.సురేష్, మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, వీఆర్‌ఓ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

చిదిమేస్తున్నారు..!

- తగ్గుతున్న బాలికల సంఖ్య
- 13 మండలాల్లో గణనీయంగా తగ్గిన వైనం
- స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు

ఆడపిల్లల సంఖ్య తక్కువుగా ఉన్న మండలాల వివరాలు..

మండలం	వెయ్యి మంది ఉండాల్సిన చోట ప్రస్తుతం ఉన్న ఆడపిల్లల సంఖ్య
బాడంగి	769
బొబ్బిలి	796
దత్తిరాజేరు	429
డెంకాడ	800
గజపతినగరం	772
గంట్యాడ	750
గుర్ల	333
మెంటాడ	800
నెల్లిమర్ల	868
రాజాం	866
ఆర్. ఆముదాలవలస	500
ఎస్.కోట	838
వేపాడ	857



ఆడపిల్ల రక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్ల పుట్టిందంటే గతంలో మహాలక్ష్మి పుట్టిందని కుటుంబం అంతా సంతోషించే వారు. బంధువులందరికీ స్వీట్స్ పంచుతూ ఆనందాన్ని పంచుకునేవారు. కాని నేడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఆడపిల్ల పుడితే భారమనే ధోరణిలో కొంతమంది తల్లిదండ్రులున్నారు. మరి కొంతమంది తల్లిదండ్రులు కడుపులో ఉన్నది ఆడ శిశువా, మగ శిశువా చెప్పాలని స్కానింగ్ సెంటర్లపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు కాసులకు కక్కుర్తి పడి లింగ నిర్ధారణ వెల్లడిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఆడపిల్ల అని తేలితే గర్భంలోనే తుంచేస్తున్నారు. వీటి వల్ల జిల్లాలో ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 1000 మంది ఆడపిల్లలు ఉండాల్సిన చోట కొన్ని చోట్ల 800 ఉంటే.. మరికొన్ని చోట్ల ఆరేడు వందల మంది చొప్పున ఉన్నారు. దీన్ని బట్టి పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చు.

13 మండలాల్లో..

జిల్లాలో 27 మండలాలుంటే 13 మండలాల్లో ఆడపిల్లలు తక్కువుగా ఉన్నారు. బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గుర్ల, మెంటాడ, నెల్లిమర్ల, రాజాం, రేగిడి ఆముదాలవలస, ఎస్.కోట, వేపాడ మండలాల్లో ఆడపిల్లల సంఖ్య తక్కువుగా ఉంది.

కానిరాని పర్యవేక్షణ..

జిల్లాలో 70 వరకు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిపై పర్యవేక్షణ అంతంత మాత్రమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి లింగ నిర్ధారణ ఎవరైనా వెల్లడిస్తున్నారా.. లేదా అని తనిఖీ చేయాల్సి ఉంది. లింగ నిర్ధారణ కోసం డెకాయ్ ఆపరేషన్లు (ఎంపిక చేసుకున్న గర్భిణిని స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి లింగ నిర్ధారణ చేయమని అడగడం) చేయాల్సి ఉంది. అటువంటి డెకాయ్ ఆపరేషన్లు జిల్లాలో ఎక్కడ కానరావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక దృష్టి సారించాం..

ఆడపిల్లల సంఖ్య తక్కువుగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఆయా మండలాల పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లను నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రాం అధికారులకు ఆదేశాలిచ్చాం. లింగ నిర్ధారణ చేసినట్లు సమాచారం ఇస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

వేధింపులు భరించలేకపోతున్నాం..

- జిల్లా ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల అసోషియేషన్



మాట్లాడుతున్న జిల్లా ఆర్టీసీ అద్దెబస్సుల యజమానుల అసోషియేషన్ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలోని ఓ అధికారి వ్యాట్ పెండింగ్ పన్నుల పేరుతో రికవరీలు చేస్తూ వేధిస్తున్నారని జిల్లా ఆర్టీసీ అద్దెబస్సుల యజమానుల అసోషియేషన్ ఆరోపించింది. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాకి చెందిన వివిధ అద్దె బస్సులకు సంబంధించి 2014–15, 2016–17 ఆర్థిక సంవత్సరాల వ్యాట్ పన్ను దాదాపు రూ.3.30 కోట్లు అప్పట్లో చెల్లించామని తెలిపారు. అప్పటి నిబంధనల మేరకు 5 శాతం పన్నును ఆర్టీసీ సంస్థే చెల్లించిందన్నారు. 2020 తర్వాత శాఖాపరమైన అధికారులు మారడంతో అప్పటి పన్నులు ఇంకా బకాయి ఉందని తమకు నోటీసులు పంపించారని చెప్పారు. ఎలాంటి ఆధారాలు చూపకుండా 14 శాతం పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చారన్నారు. 45 అద్దె బస్సులకు సంబంధించి బకాయిగా చూపించిన దాదాపు రూ.2.20 కోట్లకు గాను నెలకు రూ.25 లక్షల వంతును 8 నెలల పాటు బకాయి తీర్చాలంటూ ఆర్టీసీ సంస్థకు కమర్షియల్ ట్యాక్స్ అధికారి సమాచారం ఇచ్చారన్నారు. ఈ సమాచారాన్నే ఆదేశంగా తీసుకొని స్థానిక ఆర్టీసీ అధికారులు మాకు రావాల్సిన వేతనాల నుంచి రికవరీలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మొత్తం రికవరీ చేయడంతో బస్సుల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామని వాపోతున్నారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారి తీరుతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల అసోషియేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణ, కార్యదర్శి బి.సత్యనారాయణ, వీవీ రామారావు (రాంబాబు), సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద అనధికార వ్యక్తి దందా..

- పట్టించుకోని అధికారులు



జెండా ఊపి లారీని ఆపుతున్న అనధికార వ్యక్తి

గజపతినగరం రూరల్: గొట్లాం సమీపంలోని గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో నిర్వహిస్తున్న చెక్‌పోస్టులో (తనిఖీ కేంద్రం)ఓ అనధికార వ్యక్తి వాహనాలను ఆపి దందా చేస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. మార్కెట్ సెస్ వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టులో ఏఎంసీ ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది. అయితే వారిద్దరూ ఎప్పుడూ విధులు నిర్వహించకపోవడంతో పక్కనే ఉన్న పొల్యూషన్ వ్యాన్ యజమాని వాహనాలను ఆపి సెస్ వసూలు చేస్తున్నారు. అయితే ఈ తంతు నెలల తరబడి జరుగుతున్నా సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏఎంసీ కార్యదర్శి వద్ద సాక్షి ప్రస్తావించగా.. చెక్‌పోస్టు వద్ద ఇద్దరు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. వారు తప్ప ఇతరులు వాహనాలు ఆపి, సెస్ వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

అర్ధరాత్రి యువకుల హల్‌చల్..

- బొలేరో వాహనాన్ని అడ్డగించి డ్రైవర్, మహిళలపై దాడికి యత్నం
- వరుస సంఘటనలతో బెంబేలెత్తుతున్న రాజాం వాసులు



స్థానికులకు దాడి వివరాలు చెబుతున్న బాధితుడు

రాజాం సిటీ: రాజాం ప్రాంతంలో విష సంస్కృతి జాఢ్యం రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ నెల 18న స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో పట్టణ పరిధి మల్లికార్జునకాలనీకి చెందిన వ్యక్తిపై కత్తితో దాడి జరగగా.. ఇటీవల గరివిడి మండలం అప్పన్నవలస వద్ద రాజాం బంగారు వర్తకులపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. వీటిని మురువక ముందే మరో దాడి కలకలం రేపుతోంది. మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన రెడ్డి మహేష్ తన కుటుంబ సభ్యులతో చీపురుపల్లి పెళ్లికి వెళ్లారు. పెళ్లి అనంతరం అక్కడ నుంచి తిరిగి బొలేరో వాహనంతో స్వగ్రామానికి శుక్రవారం రాత్రి వస్తున్నారు. చీపురుపల్లి రోడ్డులోని బావిరేతమ్మ గుడి సమీపంలోకి రాగానే కొందరు యువకులు వాహనాన్ని అడ్డగించి దాడికి యత్నించారు. తిమ్మయ్యపేట సమీపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని తిప్పంచుకుని వస్తుండగా.. అదే వాహనంపై వస్తున్న యువకులు వేగంగా వచ్చి బావిరేతమ్మ గుడి వద్ద బొలెరోకు అడ్డంగా బండి పెట్టి దాడికి యత్నించినట్లు రెడ్డి మహేష్ తెలిపారు. వాహనంలో మహిళలు ఉన్నారని, ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరగా.. వారు మరో నలుగురికి ఫోన్ చేయగా వారు కూడా వచ్చి దాడికి ప్రయత్నించారని చెప్పారు. ఇంతలోకారులో ఉన్న మహిళలు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు వచ్చి ఒక యువకుడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన వారు పరారయ్యారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇదే విషయమై టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. అనుమానితులను పిలిపించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

పాచిపెంట: ముగ్గురు వ్యక్తుల నుంచి 10.21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్, శక్తి మురుగ అనే ఇద్దరు వ్యక్తులతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన అల్లంగిరి సురేష్ ఒడిశా నుంచి పాచిపెంట మీదుగా గంజాయి తరలిస్తుండగా.. పద్మాపురం పంచాయతీ రొడ్డవలస సమీపంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు శనివారం వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

విజయనగరం ఫోర్ట్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. నగరంలోని సాయినాథ్ కాలనీ, సంతపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వార్డు స్థాయిలో ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏ రోజుకు ఆ రోజు వార్డుల వారీగా సమాచారం తెప్పించుకుని సమీక్ష చేయాలన్నారు. అవసరమైన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు అప్లోడ్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్తిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుళ్ల విధులే క్రియాశీలకం

- ఎస్పీ వకుల్ జిందల్



జూమ్ మీటింగ్‌లో కోర్టు కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: నిందితులకు శిక్షలు ఖరారు కావడంలో కోర్టు కానిస్టేబుళ్ల విధులు క్రియాశీలకమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు కోర్టు కానిస్టేబుళ్లతో శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించి, వారు నిర్వర్తించాల్సిన విధుల పట్ల దిశా నిర్దేశం చేశారు. అభియోగపత్రాలు సిద్ధం చేయడం, దాఖలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఆయా పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన కేసులు ఏ కోర్టుల్లో విచారణలో ఉన్నాయి.. ఏ కేసులో ప్రాసిక్యూషన్ జరగనున్నది.. తెలుసుకుని సాక్షులు సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చూడాలన్నారు. కొన్నిసార్లు కోర్టుల్లో దాఖలైన అభియోగపత్రాలను న్యాయస్థానాలు తిప్పి పంపినప్పుడు, ఆ విషయాన్ని సంబంధిత పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అవసరమైన మార్పులు చేసి తిరిగి కోర్టుల్లో దాఖలు చేయాలన్నారు. ప్రతి నెలా కోర్టులు జారీ చేసిన సమన్లు, వారంట్లను పోలీస్‌స్టేషన్ ప్రాసెస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు ప్రతిరోజూ తమ కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశమై ఆ రోజు కోర్టుల్లో ప్రాసిక్యూషన్ జరిగిన తీరును, ఇతర విషయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న గంజాయి, పోక్సో, రేప్, హత్యకేసుల ప్రాసిక్యూషన్ సమయంలో సీఎంఎస్ సిబ్బంది సహకారాన్ని తీసుకోవాలని కోర్టు కానిస్టేబుళ్లకు సూచించారు. జూమ్ మీటింగ్‌లో డీఎస్పీలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఏవీ లీలారావు, పలువురు సీఐలు, ఎస్సైలు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన వ్యక్తి మృతి



నిరంజన్ మృత దేహం (ఇన్‌సెట్లో) నిరంజన్ (ఫైల్)

భామిని: వంశధార నదిలో గల్లంతైన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాల ప్రకారం...మండలంలోని తాలాడకు చెందిన వలరౌతు నిరంజన్ (49) ఈ నెల 22వ తేదీన ప్రమాదవశాత్తూ గ్రామసమీపంలోని వంశధార నదిలో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు గజ ఈతగాళ్లతో వెతికించగా.. శనివారం ఉదయం కీసర - కోసలి గ్రామాల మధ్య నిరంజన్ మృతదేహం లభ్యమైంది. ఎస్సై డి. అనిల్‌కుమార్ ప్రమాద స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఏఎస్సై కాంతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య శారద భామిని కేజీబీవీలో ఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు..



వృద్ధుడి మృతదేహం

గుర్ల: మండలంలోని జమ్ముపేట రైల్వే గేట్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు రైలు ఢీ కొనడంతో మృతి చెందాడని రైల్వే ఎస్సై మధుసూదనరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మృతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయన్నారు. చేతిలో కర్ర, తెలుపు లాల్చీ, తెలుపు పంచె ధరించి ఉన్నడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 94934 74582 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో వ్యక్తి..

జామి: పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కలగాడలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతుడి భార్య అందించిన వివరాల ప్రకారం.. కలగాడ గ్రామానికి చెందిన దాకరమర్రి సింహాచలం (44) ప్రతిరోజూ ఎల్.కోట మండలం గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్దకు పనికి వెళ్లి వస్తుంటాడు. శనివారం ఉదయం తన భర్త పనికి వెళ్తాడని చెప్పి అతడి భార్య క్యారేజీ సిద్ధం చేసి పనికి వెళ్లిపోయింది. అయితే సింహాచలం గ్రామ సమీపంలోని మామిడితోటలో పుట్టగొడుగుల కోసం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో సింహాచలం భార్య ఇంటికి రాగా.. క్యారేజీ ఉండడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరకు మామిడి తోటలో పాముకాటుకు గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా..అప్పటికే సింహాచలం మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వధూవరులకు గాయాలు



గాయపడిన నూతన వరుడు రాజశేఖర్



సబ్‌స్టేషన్ గోడను ఢీ కొట్టిన బొలేరో

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి సబ్‌స్టేషన్ గోడకు పెళ్లి బృందం వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో ఆరుగురికి గాయలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలియజేసిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామంలో వివాహం చేసుకున్న ఓ యువజంట బంధువులతో కలసి పెళ్లికుమార్తె ఇంటికి (సాలూరు మండలం భూతాడ కర్రివలస) బొలేరో వాహనంలో శనివారం ఉదయం వస్తున్నారు. సరిగ్గా మామిడిపల్లి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి సబ్‌స్టేషన్ గోడకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వధూవరులు సాధి రాజశేఖర్, చల్ల అనురాధతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యసిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి సాలూరు పీహెచ్‌సీకి తరలించారు. ఇందులో పెళ్లికుమారుడు, డ్రైవర్లకు తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.

జిల్లా వ్యాప్తంగా 212.5 ఎకరాల్లో లక్ష మొక్కలు

- జిల్లా అటవీ శాఖాధికారి వెంకటేష్



కొత్తపేటలోని దమరసింగి రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ వెంకటేష్

నెల్లిమర్ల రూరల్: జిల్లా వ్యాప్తంగా 212.5 ఎకరాల్లో లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.వెంకటేష్ తెలిపారు. మండలంలో కొత్తపేట దమరసింగి రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల విస్తీర్ణాన్ని పెంచాలనే ఏకైక లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖ భూముల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సహకరించాలన్నారు. మొక్కలు పెంచుతున్న ప్రాంతాల్లో మూగ జీవాలు వెళ్లకుండా చూడాలన్నారు. దమరసింగి రిజర్వు ఫారెస్ట్‌లో 50 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 20 వేల మొక్కలు నాటామని చెప్పారు. రావి, వేప, పనస, నేరేడు, టేకు, బాదం, ఉసిరి, నెమలి నార, ఎర్ర చందనం, తదితర 21 జాతుల మొక్కలు నాటుతున్నామన్నారు. జిల్లాలో షికారుగంజి, దమరసింగి, బేతానాపల్లి, తదితర రిజర్వు ఫారెస్ట్‌లో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నామన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నర్సరీల్లో 6లక్షల మొక్కలను అందుబాటులో ఉంచామని, ప్రభుత్వ సంస్థలకు, కార్యాలయాలకు ఉచితంగా అందజేస్తున్నారు. మొక్కలు కావాల్సిన వారు స్థానిక అటవీశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పలరాజు, కేవీఎస్ రాజు పాల్గొన్నారు.

జీవ వ్యవస్థలో యంత్రాల వినియోగం కీలకం



మాట్లాడుతున్న ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్

- ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్

విజయనగరం అర్బన్: జీవ వ్యవస్థలోని రక్త ప్రవాహం నుంచి అవయవాల పని తీరు వరకు ఏది తెలుసుకోవాలన్నా అధునాతన యంత్ర పరికరాల వినియోగం కీలకంగా నిలుస్తుందని ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ గురుజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'సీ ఎఫ్ డీ బేస్డ్ మోడలింగ్ ఆఫ్ మెకానికల్ సర్క్యులేటరీ సపోర్ట్ సిస్టిమ్స్ ఫర్ ది హ్యూమన్ బాడీ' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ సర్క్యులేటరీ సపోర్ట్ సిస్టమ్‌ల అభివృద్ధి, ఆప్టిమైజేషన్ సీఎఫ్‌డీ మానవ ప్రయోజనీకరమని అన్నారు. ఈ వ్యవస్థలు గుండె వైఫల్యంతో బాధపడుతున్న రోగులు తాత్కాలిక సహాయాన్ని అందించడంలో కీలకంగా పని చేస్తాయన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.